# మానుకోటను అభివృద్ధి చేసిన శంకర్‌నాయక్‌ను గెలిపించాలి

**మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి**

మహబూబాబాద్, నవంబర్ 3: మహబూబాబాద్‌ను రూ.వేల కోట్లతో అభివృద్ధి చేసేందుకు కృషి చేసిన బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌ను మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 19 వ వార్డులో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. 2014 ఎన్నికల తర్వాత నుంచి మానుకోట రూపురేఖలు మార్చేందుకు స్థానికంగా ఉంటూ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ అహర్నిశలు కృషి చేశారన్నారు. మానుకోటను జిల్లా చేయడంలో కీలక పాత్ర పోషించారని, జిల్లా కేంద్రంలో విద్య అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో మెడికల్, నర్సింగ్, హార్టికల్చర్ డిగ్రీ, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలను తీసుకొచ్చారన్నారు. వేల కోట్ల నిధులతో మున్సిపాలిటీలో వైకుంఠధామాలు, పట్టణ ప్రకృతి వనాలు, సీసీరోడ్లు, డ్రైనేజీలు, వరద కాల్వల నిర్మాణాలను చేపట్టామన్నారు. మహబూబాబాద్‌లో ఓటు అడిగే హక్కు శంకర్‌నాయక్‌కు మాత్రమే ఉందన్నారు. ఎమ్మెల్యే శంకర్‌నాయక్ గెలుపు కోసం నేను సైతం అంటూ మున్సిపల్ చైర్మన్ విస్తృత ప్రచారం చేపడుతున్నారు. కార్యక్రమంలో ఎడ్ల శ్రీనివాస్, గునిగంటి రాజన్న, నీలం వెంకటేశ్వర్లు, అలాజీపూర్ మధు, పోతుగంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మహబూబాబాద్‌లోని 19వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## బీఆర్‌ఎస్ పథకాలు దేశానికే ఆదర్శం

**కేసముద్రం (స్టేషన్)లో ఇంటింటా ప్రచారం**

కేసముద్రం, నవంబర్ 3: అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు గుగులోత్ వీరునాయక్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయని, వ్యవసాయాన్ని పండుగలా చేశారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వస్తే రూ.400కే గ్యాస్, ప్రతి కుటుంబానికి రూ.5లక్షల బీమా, మహిళలకు నెలకు రూ.3వేలు అందిస్తారని తెలిపారు. ఎకరానికి రూ.16 వేల పెట్టుబడి సాయం, 24గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు భూమాటి పురుషోత్తం, భీమా నాయక్, ముత్యాల శివకుమార్, నర్సింగం వెంకటేశ్వర్లు, మహ్మద్ రఫీ, రాపోలు శ్రీనివాస్, రాజేశ్, ఎం మహేందర్, నజీర్, టీ సాయికృష్ణ, రమేశ్ పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## కారు గుర్తుకు ఓటు వేసి అభివృద్ధికి పట్టం కట్టాలి

**బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్‌రెడ్డి**

ఇనుగుర్తి, నవంబర్ 3: కారు గుర్తుకు ఓటు వేసి మహబూబాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బొబ్బిలి మహేందర్‌రెడ్డి అన్నారు. గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టాలని కోరాడు. శుక్రవారం మండల కేంద్రంలో ఎన్నికల మ్యానిఫెస్టోను ఓటర్లకు వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే అర్హులైన మహిళలకు రూ.400కే గ్యాస్ సిలిండర్, అన్నపూర్ణ పథకం ద్వారా తెల్ల రేషన్‌కార్డు ఉన్న కుటుంబాలకు సన్నబియ్యం సరఫరా, ఆసరా పెన్షన్ రూ.5,016, దివ్యాంగులకు రూ.6,016, రైతుబంధు రూ.16వేలకు పెంపు, సౌభాగ్యలక్ష్మి పథకం కింద అర్హులైన మహిళలకు నెలకు రూ.3వేల భృతి అంధిస్తారని తెలిపారు. ప్రచారంలో సభ్యులు వేముల శ్రీనివాస్, గుండ్రపెల్లి దేవేందర్, శ్రీను, లింగాల శ్రీను, నాగేల్లి మురళి, కే మహేందర్, బీ మల్లారెడ్డి, పెండ్లి మహేందర్ పాల్గొన్నారు.

## జాతీయ ఖోఖో పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 5: గోవాలో జరుగుతున్న జాతీయ క్రీడల్లో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర ఖోఖో జట్టుకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి తోట శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. జట్టులో రంజిత్, రాజేందర్, శ్రీకాంత్, నరేశ్ ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు.



జాతీయ క్రీడలకు ఎంపికైన క్రీడాకారులు

## విద్యార్థుల పురోగతిని 'సీస్' ద్వారా తెలుసుకోవచ్చు

**జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు**

కురవి, నవంబర్ 3: కురవి, సీరోలు మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల విద్యాపురోగతిని తెలిపే (ఎస్ఈఏఎస్)స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (సీస్) పరీక్షను శుక్రవారం నిర్వహించారు. సీరోలు మండలంలో 18 పాఠశాలలు, కురవి మండలంలో 38 పాఠశాలలు, జిల్లాలో 533 పాఠశాలల్లో ఈ పరీక్ష నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి పబ్బరాజు రామారావు జడ్పీహెచ్‌ఎస్ కురవి, జడ్పీహెచ్‌ఎస్ కాంపల్లి, జడ్పీహెచ్‌ఎస్ సీరోలు, సీరోల్ ఏకలవ్య పాఠశాల, జడ్పీహెచ్‌ఎస్ చింతపల్లి, జడ్పీహెచ్‌ఎస్ కొత్తూరు(సీ) తదితర పాఠశాలల్లో నిర్వహించిన పరీక్షను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. మాట్లాడుతూ.. ఈ పరీక్షలు జిల్లా ప్రామాణిక స్థాయిని తెలియజేస్తాయన్నారు. వీటి ఫలితాలకు అనుగుణంగా విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించి, జిల్లాను పురోగతి పెంచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీరోలు, కురవి మండలాల నోడల్ అధికారులు ఇస్లావత్ లచ్చిరాంనాయక్, బాలాజీ, ప్రభుత్వ పరీక్షల జిల్లా అధికారి మందుల శ్రీరాములు, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



పరీక్షను పరిశీలిస్తున్న డీఈవో రామారావు

## పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 3: ఆట, పాటలు, శారీరక శ్రమ వల్ల మనస్సు ఉల్లాసంగా ఉంటుందని డాక్టర్ రాధిక అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాలలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ప్రసాద్, ప్రముఖ వైద్యుడు నెహ్రూ నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచంలో నిమిషానికి ఒకరు చొప్పున ఆత్మహత్యల ద్వారా చనిపోతున్నారని గణాంకాలు చెబుతున్నాయని, దానికి కారణం మానసిక సంఘర్షణలకు గురికావడమే అన్నారు. ఇలాంటి సమస్యలు ఉన్నప్పుడు తోటి సహాయకులతో సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. ఒత్తిడి ఉన్నప్పుడు వెంటనే ఆ ప్రదేశానికి దూరంగా వెళ్లాలని సూచించారు. నిర్ణయించుకున్న లక్ష్యాన్ని సాధించే విధంగా ఏకాగ్రతతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పొక్కుల సదానందం, వీరేందర్, అశోక్, స్వాతి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.




అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రాధిక

## 17లోపు పదో తరగతి పరీక్షల ఫీజు చెల్లించాలి

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 3: పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీజును ఈనెల 17వ తేదీలోపు చెల్లించాలని జిల్లా విద్యా శాఖ అధికారి రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 అపరాద రుసుంతో డిసెంబర్ ఒకటి వరకు, రూ. 200 లేట్ ఫీజుతో డిసెంబర్ 11 వరకు, రూ.500 ఫీజుతో డిసెంబర్ 20 వర కు చెల్లించాలని పేర్కొన్నారు. రెగ్యులర్ విద్యార్థులకు అన్ని సబ్జెక్టులకు రూ.125, ఫెయిల్ అయిన విద్యార్థులు మూడు సబ్జెక్టుల కంటే తక్కువ ఉన్న వారికి రూ.110, ఎక్కువగా ఉంటే రూ.120 చెల్లించాలన్నారు. ఒకేషనల్ విద్యార్థులు రూ.125 తో పాటు అదనంగా రూ.60 చెల్లించాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ.24 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.20వేలు కంటే తక్కువగా ఉంటే ఫీజు మినహాయింపు ఉంటుందన్నారు. విద్యార్థులు ఫీజులు చెల్లించే విధంగా జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చూడాలన్నారు.

## ఓటు ఆవశ్యకతపై అవగాహన

కరీమాబాద్, నవంబర్ 3: వరంగల్ మహానగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం శంభునిపేటలో మహిళా సంఘాల సభ్యులకు ఓటు ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కోలా రాజేశ్‌కుమార్ మాట్లాడుతూ ఓటుహక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఓటు ఎలా వేయాలి, పోలింగ్ స్టేషన్ ఎలా తెలుసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో వరంగల్ మహానగరపాలక సంస్థ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నెట్‌బాల్ జట్టుకు అభినందనలు

హనుమకొండ చౌరస్తా, నవంబర్ 3: సిద్దిపేటలో ఈ నెల 5వరకు జరుగనున్న రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు వెళ్తున్న ఉమ్మడి వరంగల్ జిల్లా బాలికల జట్టును ఎస్జీఎఫ్ఐ ఆర్గనైజింగ్ సెక్రటరీ బరుపాటి గోపి శుక్రవారం అభినందించారు. జట్టులో వైష్ణవి, సంకీర్తన, సునీత, స్వప్న, సత్యశ్రీ, శైలజ, మమత, స్పందన, దివ్య, కావ్య, కీర్తన, కోచ్ మేనేజర్‌గా మొగ్గి కృష్ణవేణి పాల్గొననున్నారు. ఈ సందర్భంగా వారిని ఏవీవీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ భుజేందర్‌రెడ్డి, పీఈటీ లాజరస్, అనిత, శ్రీనివాస్, సంజీవ, శ్రీధర్, శ్రీలత, శ్వేత అభినందించారు.

## బీజేపీ సభపై కేసు నమోదు

గూడూరు, నవంబర్ 3: మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ(బీజేపీ) నిర్వహించిన బహిరంగ సభ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన అంశంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాణాప్రతాప్ శుక్రవారం తెలిపారు. గూడూరులోని కన్యకాపరమేశ్వరి ఫంక్షన్ హాలు ఎదురుగా ఉన్న మైదానంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గత గురువారం బీజేపీ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి ప్రభుత్వ స్తంభాలకు జెండాలు కట్టడం, అనుమతిలేని వాహనాల్లో పరిమితికి మించి జనాలను తరలించడం, నిర్ధేశించిన ఖర్చు కంటే ఎక్కువ మొత్తంలో ఫ్లెక్సీలకు వ్యయం చేయడం వంటి అంశాలలో ఎన్నికల సంఘం ఫ్లయింగ్ స్కాడ్ టీం (ఎఫ్ఎస్‌టీ) వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్ల ఎస్సై తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.